సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 13 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 595 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఆకుపచ్చని జీవితాలు

రేకులకుంట రైతులు ఆకుకూరల సాగులో రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం గడిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.6°/21.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 6.891 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బుధవారం 17,383 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చింది. డ్యాంలో నీటి నిల్వ 6.891 టీంఎసీలకు చేరింది. వరద ఇలాగే కొనసాగితే నెల రోజుల్లో జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పోగాకు రామచంద్రకు కీలక పదవి



పోగాకు రామచంద్ర

పెనుకొండ: రాష్ట్ర వాల్మీకి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పోగాకు రామచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వాల్మీకుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు నిబద్ధత గల పోగాకు రామచంద్రకు చైర్మన్ పదవి అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు వాల్మీకులు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయంగా వాల్మీకులకు సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అలాగే నూతన చైర్మన్ రామచంద్రకు పలువురు వాల్మీకి నేతలు, బీసీ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు




మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పశువులను అక్రమంగా రవాణా చేసినా, వధించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. పశువుల అక్రమ రవాణా నిరోధానికి జిల్లాలో ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం జంతువులను వధించడం, రవాణా చేసిన చట్టరీత్యా నేరమన్నారు నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో జంతువులను వధించడానికి అనుమతులు లేవన్నారు. లైసెన్స్ పొందిన ప్రదేశాల్లో మాత్రమే జంతువధ చేయాల్సి ఉంటుందన్నారు. గోవధ నిషేధ చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లాలో నోడల్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్నా పోలీస్‌వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా చేసే వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

రాత.. పచ్చ రోత

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై 'పచ్చ' పత్రిక విషం చిమ్ముతోంది. అసత్యాలతో కథనాలు అల్లి వడ్డిస్తోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో బహిరంగంగా కుమ్ములాటలు జరుగుతున్నా.. అధిష్టానాన్ని ధిక్కరించి వ్యవహరిస్తున్నా, బడుగులపై అగ్రవర్ణ నాయకులు దాష్టీకం ప్రదరిస్తున్నా, భూకబ్జాలకు పాల్పడుతున్నా కనిపించనట్టు నటిస్తోంది. అధికార పార్టీపై మాత్రం పనిగట్టుకుని ఉన్నవీ, లేనివీ కల్పించి 'అవినీతి' మకిలిని అంటించి తప్పుడు రాతలతో రోత పుట్టిస్తోంది.

- వైఎస్సార్‌సీపీలో క్రమశిక్షణకు పెద్దపీట
- ప్రజల్లో ఉండే నాయకులకే పట్టం కడుతున్న అధిష్టానం
- క్రమశిక్షణ చర్యలకు అవినీతి మకిలి అంటిస్తూ 'ఈనాడు' తప్పుడు రాతలు
- టీడీపీలో నాయకులు రోజూ తన్నుకుంటున్నా అక్షరం ముక్క రాయని వైనం
- శింగనమలలో దళిత నాయకుడిని కొట్టినా పరామర్శించకుండా వెళ్లిపోయిన లోకేష్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'సంక్షేమం – అభివృద్ధి' అనే నినాదంతో ఆవిర్భవించిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. రాజకీయ పార్టీలో వర్గాలుండొచ్చుగానీ, వర్గపోరు ఉండకూడదు. ఇదే నినాదంతో ముందుకెళుతూ ఎవరు క్రమశిక్షణ ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకునేందుకు అధిష్టానం ఎప్పుడూ వెనుకాడలేదు. మూడు మాసాల కిందట పెనుకొండ నియోజకవర్గానికి చెందిన నాగభూషణంరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తాజాగా ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన మధుసూదన్‌రెడ్డి పార్టీ లైన్ దాటి వ్యవహరించినందుకు పార్టీనుంచి సస్పెండ్ చేశారు. శింగనమల నియోజవర్గానికి చెందిన చామలూరు రాజగోపాల్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి హెచ్చరించిన విషయం తెలిసిందే. పార్టీలో ఎంతటి వారైనా గీత దాటితే వారిపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందనేది తొలినుంచీ తెలిసిందే. క్రమశిక్షణకు మారుపేరు కాబట్టే ఐక్యతతో 2019 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 సీట్లకు గాను 12 అసెంబ్లీ సీట్లు సాధించగలిగారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అన్నిటికీ పార్టీ ఆదేశాలే సుప్రీం అన్న సూత్రం కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకూ అందరికీ వర్తిస్తుందనేది తెలిసిందే.

'పచ్చ' ప్రేమ.. రోత రాతలు..

తెలుగుదేశం పార్టీకి 'ఈనాడు' పత్రిక కరపత్రంగా మారింది. రోతరాతలు, అబద్ధాలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా 'అక్రమాల మయం–అసమ్మతి స్వరం' అంటూ జిల్లా ఎడిషన్‌లో ఓ కథనాన్ని వండి వార్చారు. అవినీతిపై ప్రశ్నించినందుకే వారిని పార్టీనుంచి సస్పెండ్ చేశారంటూ తప్పుడు రాతలు రాశారు. ప్రశ్నిస్తే కేసులే అంటూ మసాలా కలిపి వండి వడ్డించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకూ బలహీన పడిపోతున్న విషయాన్ని పక్కన పెట్టి ప్రజల్లో బలం పెరుగుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై 'ఈనాడు' విషం చిమ్మడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

'తమ్ముళ్ల' తన్నులాటను రాయలేని దైన్యం..

తెలుగుదేశం పార్టీలో నాలుగు వర్గాలు, ఆరు తన్నులాటలు అన్న చందంగా ఉంది. ఎక్కడికక్కడ ప్రతిరోజూ బాహాబాహీ జరుగుతూనే ఉంది. కానీ వీటిపై 'ఈనాడు' అక్షరం ముక్క రాయదు.

- నారా లోకేష్ యువగళం పేరుతో పెనుకొండ నియోజకవర్గంలోకి రాగానే సవితమ్మ, బీకే పార్థసారథి వర్గీయులు నడివీధిలో చెప్పులతో కొట్టుకున్నారు. కానీ ఇది రాయలేకపోయారు.
- కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయచౌదరి, ఉమా మహేశ్వరనాయుడు వర్గీయులు పట్టపగలే నడిరోడ్డుపై తన్నుకున్నారు. ఈ తన్నులాటను ఈనాడు చూడలేకపోయింది.
- శింగనమల నియోజకవర్గంలో తన తండ్రిని కొట్టారంటూ టీడీపీ నాయకురాలు, దళిత మహిళ బండారు శ్రావణి కన్నీరు పెట్టుకున్నారు. ఆ సమయంలో ఇదే జిల్లాలో లోకేష్ 'యువగళం' పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అయినా ఆయన బాధితులను పరామర్శించిన పాపానపోలేదు. ఈ విషయానికి 'ఈనాడు' పాతరేసింది.
- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అవినీతి అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా తెరిచిన పుస్తకం కాగా.. ఈనాడు దృష్టిలో అవి ముగిసిన అధ్యాయంలా ఉంది. పదెకరాలు ఆక్రమించి కరివేపాకు పంట పెట్టినా రాసే సాహసం చేయరు. జేసీ సోదరులు టీడీపీలో చేరగానే 'ఈనాడు' దృష్టిలో వారు పునీతులైపోయారు.
- కదిరిలో చాంద్‌బాషా, కందికుంట ప్రసాద్ వర్గీయులు నడిబజారులో తన్నుకున్నా 'ఈనాడు'కు కనిపించవు.
- మడకశిరలో గుండుమల తిప్పేస్వామి అక్రమాలు చేస్తుంటే ఈ పచ్చపత్రిక కళ్లు లేని కబోదిలా వ్యవహరించిందనేది అందరికీ తెలిసిందే.

మంగళగిరికి మడకశిర తమ్ముళ్లు

- పార్టీ హైకమాండ్ నుంచి ఇరు వర్గాలకూ పిలుపు
- బయలుదేరి వెళ్లిన గుండుమల, ఈరన్న వర్గాలు
- నేడు ఫోర్‌మెన్ కమిటీ సభ్యులతో సమావేశం

మడకశిర: ఎస్సీ రిజర్వు నియోజకవర్గం మడకశిరలో టీడీపీ నేతల అధిపత్య పోరు పంచాయితీ మంగళగిరికి చేరింది. గురువారం ఫోర్‌మెన్ కమిటీ సమావేశం నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గాలకు టీడీపీ హైకమాండ్ నుంచి పిలుపు అందింది. దీంతో రెండు వర్గాల నాయకులు బుధవారం మంగళగిరికి బయలుదేరి వెళ్లారు.

రెండోసారి పంచాయతీ

వలగపూడి అనిత, జవహర్, నక్కా ఆనంద బాబు తదితరులున్న ఫోర్‌మెన్ కమిటీ ఇప్పటికే ఓ సారి రెండు వర్గాలను మంగళగిరి పార్టీ కార్యాలయానికి పిలిపించుకుని పంచాయితీ చేసింది. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చంద్రబాబు రంగంలోకి దిగి మడకశిర తమ్ముళ్లతో మంతనాలు చేశారు. అది కూడా ఫలించకపోవడంతో తాజాగా మరోసారి రెండు వర్గాలనూ పిలిపించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వర్గాల మధ్య రాజీ కుదుర్చి ఏకతాటిపైకి తేవాలని టీడీపీ పెద్దలు భావిస్తున్నారు.

రెండేళ్ల నుంచీ తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు

మడకశిర టీడీపీలో ఆదినుంచీ వర్గ విభేదాలు ఉన్నాయి. కానీ రెండేళ్ల నుంచీ అవి తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో రెండు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి విషయంలోనూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల వర్గందే పైచేయి అవుతూ వస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి హైకమాండ్ ఈరన్నను తప్పించి గుండుమల తిప్పేస్వామికి కట్టబెట్టింది. మండల కమిటీల్లో ఈరన్నవర్గానికి అవకాశం కల్పించలేదు. అంతే కాకుండా బస్సుయాత్ర కమిటీలోనూ ఈరన్నకు చోటు కల్పించడాన్ని గుండుమల వర్గం వ్యతిరేకించింది. దీంతో మడకశిరలో నిర్వహించాల్సి ఉన్న బస్సుయాత్రను హైకమాండ్ ఏకంగా రద్దు చేసింది. ఇలాంటి పరిస్థితిలో ఈరెండు వర్గాలను ఏకం చేయడానికి హైకమాండ్ చేస్తున్న ప్రయత్నం ఫలిస్తుందో లేదో వేచి చూడాలి.

19 నుంచి గూగూడు బ్రహ్మోత్సవాలు

- అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలి
- ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. 31 వరకు సాగే బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. బుధవారం అనంతపురంలోని డ్వామా హాలులో ఆర్డీఓ మధుసూదన్ అధ్యక్షతన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు కుల, మతాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. 26వ తేదీన చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు ఉంటుందన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పారిశుధ్య సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వీలైనన్ని బస్సులు తిప్పడానికి ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పార్కింగ్ సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పార్కింగ్ స్థలాలు గుర్తించాలన్నారు. వైద్య సిబ్బంది మందులు అందుబాటులో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నార్పల తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది, గూగూడు కుళ్లాయిస్వామి ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వ్యాపారులకు అండగా ఉంటాం

- బాధిత వ్యాపారులకు లేపాక్షి ఎంపోరియంలో రెండు కౌంటర్లు
- ఏపీ రాష్ట్ర హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి



బాధితులను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

ధర్మవరం అర్బన్: చేనేత వ్యాపారులకు అండగా ఉంటామని ఏపీ రాష్ట్ర హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. బుధవారం ఆమె జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళితో కలిసి ధర్మవరంలో పర్యటించారు. విజయవాడ 'ఆలయ సిల్క్స్' షోరూం యజమాని చేతిలో దాడికి గురైన చేనేత వ్యాపారులు గిర్రాజు శశి, కోటం ఆనంద్‌ను పరామర్శించారు. బాధిత చేనేత వ్యాపారులు చీరలు విక్రయించుకునేందుకు లేపాక్షి ఎంపోరియంలో రెండు కౌంటర్లు ఉచితంగా కేటాయిస్తామన్నారు. చేనేతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యాపారులపై దాడి చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత వ్యాపారులపై దాడి విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్పందించిన తీరు అభినందనీయమన్నారు. బాధితులతో ఫిర్యాదు చేయించి ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్‌గుప్త, అతని అనుచరుడు చేవెళ్ల నాగేశ్వరరావుపై కేసులు నమోదు చేయించి వారిని వెంటనే అరెస్టు చేసేలా చూశారన్నారు. చేనేతలకు అండగా నిలబడిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ప్రతిఒక్కరూ అభినందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు గిర్రాజు నగేష్, తొగటవీర క్షత్రీయ సంఘం రాష్ట్ర నాయకులు పుట్లూరు రామకృష్ణ, ఆంధ్ర రీజియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మూలం చంద్రప్ప, గురుపీఠం చేనేత నాయకులు పుష్పండ మహర్షి, ఏపీహెచ్‌డీసీ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పీవీ రామకృష్ణ, అనంతపురం లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది సురేష్, కాటమయ్య, తోలు బొమ్మల హస్త కళాకారులు రామదాసు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విజయలక్ష్మి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

స్నాతకోత్సవానికి రావాలని గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న ఎస్కేయూ వీసీ

అనంతపురం: ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని యూనివర్సిటీ చాన్సలర్/ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎస్కేయూ అభివృద్ధి పనుల గురించి గవర్నర్ ఆరా తీసినట్లు వీసీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, స్నాతకోత్సవానికి గవర్నర్ రాక నేపథ్యంలో యూనివర్సిటీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

బైపాస్ రోడ్డు రెడీ!

కొడికొండ–శిర మధ్య నిర్మించిన జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 544ఈ)కి మడకశిర వద్ద నిర్మిస్తున్న బైపాస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నెలాఖరులోపు పనులన్నీ పూర్తి చేసి బైపాస్ అందుబాటులోకి తేనున్నారు. దీంతో మడకశిరలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

- శరవేగంగా మడకశిర బైపాస్ రోడ్డు పనులు
- ఈ నెలాఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు
- మడకశిరలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం



రూపుదిద్దుకున్న మడకశిర బైపాస్ రోడ్డు

మడకశిర: పట్టణ సమీపంలో కొడికొండ–శిర (ఎన్‌హెచ్ 544ఈ) జాతీయ రహదారికి బైపాస్ రూపుదిద్దుకుంటోంది. పట్టణ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నుంచి చీపులేటి వరకు 2.8 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేస్తున్న బైపాస్ కోసం కేంద్రం రూ.12.40 కోట్లు వ్యయం చేస్తోంది.

కొడికొండ–శిర జాతీయ రహదారిలో భాగంగా...

కేంద్ర ప్రభుత్వం కొడికొండ–శిర (ఎన్‌హెచ్ 544ఈ) మధ్య మడకశిర మీదుగా జాతీయ రహదారి ఏర్పాటుకు రూ.100 కోట్ల మంజూరు చేసింది. ఈ నిధులతో 99 కిలోమీటర్ల పొడవుతో జాతీయ రహదారిని నిర్మించారు. అందులో భాగంగానే ప్రస్తుతం మడకశిర వద్ద బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే కొడికొండ–శిర(ఎన్‌హెచ్ 544ఈ) జాతీయ రహదారి పనులు వందశాతం పూర్తి అయినట్లే.

తొలుత మడకశిర గుండా అలైన్‌మెంట్..

కొడికొండ–శిర (ఎన్‌హెచ్ 544ఈ) మధ్య ఏర్పాటు చేసిన జాతీయ రహదారి తొలుత మడకశిర పట్టణం గుండా ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే విభాగం ఇంజినీర్లు అలైన్‌మెంట్ రూపొందించారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని పట్టణం మీదుగా ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరుగుతుందని, అలాగే ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల అలైన్‌మెంట్ మార్చి ఊరు బయట రోడ్డును నిర్మించాలని విన్నవించారు.

రోడ్డు నిర్మాణం శరవేగం..

స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు కేంద్రం రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్పు చేసింది. ఇందుకోసం మడకశిర వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులిచ్చింది. దీంతో జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్లు 2.8 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతానికి 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులూ ఈ నెలాఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. బైపాస్ అందుబాటులోకి వస్తే శిర, తుమకూరు, మధుగిరి, బెంగళూరు, మంగళూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మడకశిర పట్టణంలోకి వెళ్లకుండా బైపాస్ రోడ్డు ద్వారా నేరుగా చీపులేటి వద్ద అదే జాతీయ రహదారిలోనే కలవడానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే మడకశిరలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

ట్రాఫిక్ సమస్య ఉండదు



జాతీయ రహదారికి బైపాస్ రోడ్డు నిర్మిస్తుండడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్పు చేసేలా చూశాం. నేషనల్ హైవే విభాగం ఇంజినీర్లపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకుని రావడంతోనే అలైన్‌మెంట్‌లో మార్పు జరిగింది. బైపాస్ రోడ్డు నిర్మాణం కొన్ని రోజుల్లోనే పూర్తవుతుంది. బైపాస్ రోడ్డు వినియోగంలోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తి స్థాయిలో తీరుతుంది.

– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

పట్టణ వాసులకు ఊరట



పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది. జాతీయ రహదారిని పట్టణ మీదుగా ఏర్పాటు చేసి ఉంటే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యేది. ఎంతో ముందుచూపుతో జాతీయ రహదారికి ఊరు బయటనే బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. బైపాస్ రోడ్డు వల్ల ప్రమాదాలనూ చాలా వరకు నివారించవచ్చు.

– అహమ్మద్ అలీ, మడకశిర

నెలాఖరులోపు పనుల పూర్తి

మడకశిర బైపాస్ రోడ్డు పనులు ఈనెలాఖరులోపు పూర్తి చేస్తాం. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. బైపాస్ రోడ్డుకు దాదాపు రూ.12.40 కోట్లు వ్యయం చేస్తున్నాం.

– జగదీష్‌గుప్త, డీఈ, జాతీయ రహదారులు

విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న రెహమాన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ డిజిటల్ విద్యను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారని డిజిటల్ విద్య బోధన శిక్షణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు రెహమాన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన సంస్కృతీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి డిజిటల్ విద్య శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఎన్నుడూ లేని విధంగా ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాధికారి రంగస్వామి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, లాజరు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులకు ఆహ్వానం

లేపాక్షి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 సంవత్సరంలో రెండోవిడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు లేపాక్షిలోని ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రాయపురెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ (www.iti.ap.gov.in) ద్వారా ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం సంబంధిత సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో వెరిఫికేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వ ఐటీఐల ప్రవేశాలకు ఆగస్టు 3, 4 తేదీలు, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాలకు 5, 6 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుంది.

444 రోజుల డిపాజిట్ పథకం లాభదాయకం

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అమలు చేస్తున్న 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్ పథకం ఎంతో లాభదాయకమని ఆ బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత తెలిపారు. బుధవారం డీసీసీబీ సమావేశ మందిరంలో నోడల్ ఆఫీసర్లు, సీనియర్ అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. నూతన డిపాజిట్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. లాభదాయకమైన ఈ పొదుపు పథకం కింద ఖాతాదారులకు 7.70శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.20 శాతం వడ్డీరేటు వర్తిస్తుందన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై విరివిగా రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రూ. 2వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి... తల్లి మృతి

తనకల్లు: మండలంలోని కొర్తికోటలో కుమారుడు రమణ మద్యం మత్తులో తల్లిపై దాడి చేయడంతో మృతి చెందింది. వివరాలు...కొన్నేళ్లుగా బెంగుళూరులో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమణ మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకోవడంతో తల్లి గంగులమ్మ (77) మందలించింది. దీంతో తల్లి గంగులమ్మను గట్టిగా తోసేయడంతో ఆమె ఇనుప మంచంపై పడి మృతి చెందింది. ఈ విషయమై పోలీసులకు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నేడు డయల్ యువర్ 'విద్యుత్ ఎస్ఈ'

అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు 08554– 272943 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించవచ్చు.

ఆకుపచ్చని జీవితాలు



ఈమె పేరు శివలక్ష్మి. బుక్కరాయసముద్రం మండలం అమ్మవారిపేట. భర్త పోతులయ్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలను చదివిస్తున్నారు. సొంత భూమి లేకపోవడంతో ఓ వ్యక్తితో 25 సెంట్ల పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. ఆకు కూరలు సాగు చేస్తూ రోజూ రూ.వెయ్యి నుంచి రూ.1,200 ఆదాయం పొందుతున్నారు.

- ఆకుకూరల సాగులో రాణిస్తున్న రేకులకుంట, పరిసర గ్రామాల రైతులు
- సెంటు భూమిలోనూ పంట సాగు
- తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం



ఆకుకూరలు తొలగిస్తున్న మహిళలు

అనంతపురం డెస్క్: రేకులకుంట.. ఈ పేరు ఉమ్మడి జిల్లా రైతులకు చిరపరిచితమే. ఇక్కడి వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్) రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచింది. వివిధ పంటలకు సంబంధించిన పరిశోధనల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. వ్యవసాయ పరిశోధనలకు పేరుగాంచిన రేకులకుంట.. మరో గుర్తింపునూ సొంతం చేసుకుంది. ఆకుకూరల సాగుకు కేరాఫ్‌గా మారింది. గ్రామంలో మెజార్టీ రైతులు ఎంతోకొంత విస్తీర్ణంలో ఆకుకూరలు పండిస్తూ ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు.

ఫలితమిచ్చిన ప్రత్యామ్నాయం..

బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రేకులకుంట గ్రామం అనంతపురం నగరానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. దాదాపు 300 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అందరూ వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. గతంలో వేరుశనగ, వరి ఎక్కువగా సాగుచేసేవారు. ముఖ్యంగా వేరుశనగలో వరుస పంట నష్టాలు రావడంతో ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో వారిని ఆకుకూరల సాగు ఆదుకుంది.

సెంటు విస్తీర్ణంలోనూ...

రేకులకుంట గ్రామ పరిసరాల్లో ఎటుచూసినా ఆకుకూరల పంటలు కన్పిస్తాయి. ఒక్కొక్క రైతు తమ స్థాయిని బట్టి రెండెకరాలు మొదలుకుని సెంటు విస్తీర్ణంలోనూ ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లోనూ పంట వేస్తున్నారు. మలక్కూర, తోటకూర, మెంతాకు, గోంగూర, చుక్కాకు, పలకలాకు, కొత్తిమీర, కరివేపాకు తదితర ఆకుకూరలను పండిస్తున్నారు. గ్రామంలో 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కేవలం ఆకుకూరలే సాగు చేస్తుండడం విశేషం. రేకులకుంటతో పాటు సమీపంలోని దయ్యాలకుంటపల్లి, అమ్మవారిపేట గ్రామాల్లోనూ పలువురు రైతులు ఆకుకూరల సాగు ద్వారా మంచి ఆదాయం పొందుతున్నారు.

నిలకడగా ఆదాయం..

ఆకుకూరల సాగుకు పెట్టుబడి తక్కువ. ఎకరా విస్తీర్ణంలో పంట వేసేందుకు రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికొచ్చిన తర్వాత రూ.50 వేలకు పైగానే ఆదాయం లభిస్తుంది. రైతులు తమ పొలాలను చిన్నచిన్న భాగాలుగా విభజించుకుని రకరకాల ఆకుకూరలు పండిస్తున్నారు. ఒకవైపు పంటకోత పూర్తయ్యేలోగా.. మరోవైపు కోతకు సిద్ధమవుతోంది. ఇలా ఏడాది పొడవునా దిగుబడి లభిస్తోంది. రోజూ ఏదోఒక ఆకుకూరను మార్కెట్టుకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా రోజూ రైతుల చేతికి డబ్బు వచ్చి చేరుతోంది. అంతేగాక రైతు కుటుంబాల్లోని వ్యక్తులు బయటి పనులకు వెళ్లే అవసరమే లేదు. నిత్యమూ వారి పొలాల్లోనే చేతినిండా పని ఉంటోంది.



మార్కెట్‌కు తరలించేందుకు వాహనంలో సిద్ధంగా ఉన్న ఆకుకూరలు

నగరంలో విక్రయం..

రేకులకుంట పరిసర గ్రామాల రైతులు పండిస్తున్న ఆకుకూరలను ఎక్కువగా అనంతపురం నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కొందరు నగరంలోని కూరగాయల వ్యాపారులకు హోల్‌సేల్‌గా అమ్ముతుండగా..మరికొందరు సొంతంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ పండిస్తున్న ఆకుకూరలు అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకూ ఎగుమతి అవుతున్నాయి.

నిరంతరం ఆదాయమే



వరి, వేరుశనగ పంట దిగుబడులు రావాలంటే 3 నుంచి 5 నెలల వరకు వేచిచూడాలి. ఆ తరువాత కూడా పంట చేతికొస్తుందో, లేదో తెలీదు. అదే ఆకు కూరలు సాగు చేస్తే 15–30 రోజులకే ఆదాయం పొందవచ్చు. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం తీసుకోవచ్చు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటున్నారు. దీనివల్ల మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంటోంది.

– వీరాంజినేయులు, రేకులకుంట

రోజూ పని దొరుకుతోంది..



రేకులకుంట పరిసర గ్రామాల్లో ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు. దీనివల్ల నాలాంటి కూలీలకు రోజూ పొలం పనులు దొరుకుతున్నాయి. రూ.200 రోజు కూలి ఇస్తున్నారు. పని కూడా సులభమే.

– లక్ష్మిదేవి, అమ్మవారిపేట

పదేళ్లుగా పండిస్తున్నా..



పదేళ్లుగా ఆకుకూరలు పండిస్తున్నా. అనంతపురం దగ్గరగా ఉండడంతో విక్రయం కూడా సులభమే. మిగిలిన పంటల కంటే ఆకుకూరలు ఎంతో మేలు. ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ. చీనీ చెట్ల మధ్యలోని అరఎకరా పొలంలో ఎప్పుడూ ఆకుకూరలే వేస్తాం.

– సాకే లక్ష్మి నారాయణ, రేకులకుంట

అపహరణ యత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

హిందూపురం అర్బన్: యువతి అపహరణ యత్నం కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ కంజాక్షన్ తెలిపిన మేరకు... ధర్మవరం ప్రాంతానికి చెందిన మల్లేశ్వరి హిందూపురంలోని చిన్నమార్కెట్ సమీపంలోని ఓ వసతి గృహంలో ఉంటూ ఓ ప్రైవేట్ సంస్థలో డీటీపీ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి యశోద, అవ్వ యల్లమ్మ, పిన్ని నారాయణమ్మతో పాటు నరేష్ అనే వ్యక్తి కారులో వచ్చి వసతి గృహం నుంచి మల్లేశ్వరిని బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో విచారణ చేస్తుండగా కానిస్టేబుల్ రూపాపై యువతి కుటుంబసభ్యులు దాడికి తెగబడ్డారు. దీంతో నిందితులపై విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి, కిడ్నాప్ యత్నం కింద రెండు కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జేసీబీ తగిలి రైతు మృతి

పుట్టపర్తి అర్బన్: జేసీబీ తగలడంతో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామానికి చెందిన ఆవుల చిన్న నరసింహుడు (62)కు భార్య నాగరత్న, నలుగురు కుమారులు ఉన్నారు. పాడి పోషణతో జీవనం సాగిస్తున్న ఆయన బుధవారం ఉదయం తన పశువులను గ్రామ శివారులోని పొలంలో మేపునకు వదిలి రోడ్డు పక్కన గడ్డిలో కూర్చొన్నాడు. అదే సమయంలో పొలాలు చదును చేయడానికి వెళ్లిన గోరంట్ల మండలం జౌకలదిన్నెకు చెందిన వేణుగోపాలరెడ్డి జేసీబీని తీసుకెళుతూ రైతును గమనించకుండా దూసుకెళ్లాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహుడుని ఆగమేఘాలపై ద్విచక్ర వాహనంపై పుట్టపర్తికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ దాదాపీర్ తెలిపారు.



మృతుడు చిన్న నరసింహుడు

ప్యాకేజీ స్టార్ క్షమాపణ చెప్పాల్సిందే



పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

ప్రశాంతి నిలయం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం పట్ల వలంటీర్లు మండిపడ్డారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లో బుధవారం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి పెట్రోల్ పోసి తగులబెట్టారు. ప్యాకేజీ స్టార్ డౌన్ డౌన్, చంద్రబాబు దత్తపుత్రుడా టీడీపీ అజెండాను పక్కన పెట్టాలి, వలంటీర్ల జోలికొస్తే చెప్పులతో ప్యాకేజీ ఇస్తాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సేవా భావంతో పనిచేస్తున్న తమపై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. కరోనా కష్టకాలంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు, నారా లోకేష్ ఇళ్లలో దాక్కుంటే ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందించి ప్రజలను ఆదుకున్నది వలంటీర్లేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని, లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని వలంటీర్లు పాలకగొన్నారు.

సైకో పవన్‌కు పతనం తప్పదు..

పేద ప్రజల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమం కోసం పాటుపడుతున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సైకో పవన్‌కు పతనం తప్పదని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. పవన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎనుములపల్లి గణేస్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి,వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ,రూరల్ కన్వీనర్‌లు రంగారెడ్డి, నర్సారెడ్డి, కౌన్సిలర్‌లు సాయిగీత, సూర్యాగౌడ్, భాస్కర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఈశ్వరెడ్డి, నాయకులు గంగాద్రి, మాధవరెడ్డి,మరుట్ల నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల వేళల మార్పు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో నిత్యం జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల వేళల్లో మార్పు చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం యథావిధిగా 8 గంటలకు వేద పఠనం ఉంటుంది. 9.30 గంటలకు మంగళహారతి ఇస్తారు. తిరిగి సాయంత్రం 4.30 నుంచి 5.15 గంటల వరకు వేద పఠనం, అనంతరం 6 గంటల వరకూ భజనలు ఉంటాయి.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు గంగాధర్ అప్పులబాధతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. చేనేత కూలి మగ్గం నేసే గంగాధర్ కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనోవేదనకు గురై ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య రాధ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పట్టుబడ్డ జూదరులు

పుట్టపర్తి టౌన్: ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని కొత్తచెరువు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాగిరి రామయ్య, ఎస్ఐ లింగన్న వెల్లడించారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ సమీపంలో ఆన్‌లైన్ విధానంలో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లుగా అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అమడగూరు మండలానికి చెందిన అమరనాథ్, పుటపర్తిలోని సాయినగర్ నివాసి నాగరాజు, వివేకానంద రోడ్డుకు చెందిన రంగనాథ్ పట్టుబడ్డారు. వీరి నుంచి పేకముక్కలు, సెల్‌ఫోన్‌ను పోలిన ఓ పరికరం, అడాప్టర్, కెమెరా, 2 మైక్రోఫోన్లు, ఇయర్ బడ్స్, రూ.3,510 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మిద్దెపై నుంచి కింద పడి వ్యక్తి మృతి



మృతుడు ఆంజనేయులు

పెనుకొండ రూరల్: మిద్దెపైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిసిన మేరకు... పెనుకొండ మండలం మరుపల్లికి చెందిన వడ్డి ఆంజనేయులు (49) బుధవారం సాయంత్రం తన ఇంటి మిద్దెపై కోళ్లను గంప కింద మూసి పెడుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తల వెనుక బలమైన గాయం కావడంతో అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చారిత్రక శాసనాలు కాపాడుకుందాం

పెనుకొండ: అత్యంత పురాతన చరిత్రతో పాటు రాచరికపు నేపథ్యమున్న శాసనాలను కాపాడుకుందామంటూ చరిత్రకారుడు మైనాస్వామి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... క్రీ.శ.1,354కు ముందే పెనుకొండలో రాచరికపు వైభవం నెలకున్నట్లుగా తెలుస్తోందన్నారు. వీటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

17 మంది జూదరుల అరెస్ట్

మడకశిర రూరల్: జిల్లా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ పోలీసులు (ఎస్ఓజీ ఫోర్స్) బుధవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పెద్ద సంఖ్యలో జూదరులు పట్టుబడ్డారు. ఈ మేరకు మడకశిర సీఐ సురేష్‌బాబు తెలిపారు. మడకశిర మండలం బుళ్ల సముద్రం సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న 17 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 20 సెల్‌ఫోన్లు, 13 ద్విచక్ర వాహనాలు, రూ.1,49,060 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సంతృప్తికర వైద్య సేవలు అందాలి

ప్రశాంతి నిలయం: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో సంతృప్తికర వైద్య సేవలు అందించాలని సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. బుక్కపట్నం మండలం చుక్కలూరివారిపల్లిని బుధవారం ఆయన సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పాముదుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన నాడు నేడు పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్రగాయాలు

పావగడ: ఎలుగుబంటి దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన మేరకు... పావగడ తాలూకా ఎత్తినహల్లి గ్రామానికి చెందిన ప్రభాకరరెడ్డి బుధవారం తెల్లవారుజామున పొన్న సముద్రం గ్రామానికి కాలి నడకన ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో చెరువు కట్ట వద్దకు చేరుకోగానే ఎలుగు బంటి (పిల్లల తల్లి) ఒక్క ఉదుటన అతనిపై దూకి ముఖంపై దాడి చేసింది. అతి కష్టంపై ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకుని సమీపంలోని ఓ షెడ్డులోకి పరుగునా వెళ్లి తలదాచుకున్నాడు. అప్పటికే ఆయన ముఖం పచ్చడై పోయింది. ముక్కు ఓ వైపు తెగిపోయింది. కాసేపటి తర్వాత పిల్లలతో కలసి ఎలుగుబంటి వెళ్లిపోవడంతో బయటపడిన ప్రభాకరరెడ్డిని స్థానికులు వెంటనే పావగడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న ప్రభాకరరెడ్డి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

బత్తలపల్లి: గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పుస్తకాలను వరుస క్రమంలో ర్యాక్స్‌లో అమర్చడం పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ గ్రంథాలయాలలో పాఠకుల సంఖ్య పెరగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల నుంచి పండు ముసలి వారి వరకు పుస్తకాలు ఉన్నాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు కృషి చేయాలి

తాడిమర్రి: గ్రంథాలయాల పన్నుల వసూలుకు కృషి చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ గ్రంథాలయ అధికారి శీనా నాయక్‌కు ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని అకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర పుస్తకాలు, నవళ్లు, కథల పుస్తకాలు, దిన ప్రతికలు పాఠకులకు అందుబాటులో ఉంచాలన్నారు. పాఠకులకు అవసరం ఉన్నచో రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిస్టర్ నందు నమోదు చేయాలని వాటిని త్వరలో తెప్పిస్తామని ఆమె తెలిపారు. పాఠకులకు కుర్చీలు, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సంస్థ జిల్లా కార్యదర్శి రమ

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

గాండ్లపెంట: మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ సారువువాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.నరసింహారావును విధుల నుంచి తొలగించినట్లు ఎంఈఓ క్రిష్ణానాయక్ బుధవారం తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు జూలై 2019 ఏడాది నుంచి గడిచిన 4 సంవత్సరాలుగా విధులకు హాజరు కాలేదన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి, సెలవు లేకుండా గైర్హాజరైయ్యారని తెలిపారు. పలుమార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. ఈ క్రమంలో విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం: ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ మహిళలకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో బ్యూటీ పార్లర్, కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 2 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. కంప్యూటర్ ట్యాలీ శిక్షణకు ఇంటర్మీడియట్‌లో సీఈసీ, బీకాం పూర్తి చేసిన వారు అర్హులు. బ్యూటీపార్లర్ శిక్షణకు పదో తరగతి ఫెయిల్ లేదా పాస్ అయిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 94409 05479, 96188 76060, 08554–255925లో సంప్రదించవచ్చు.